# ఓపికలు కోల్పోయిన గోపికలు


మన పోతన మధురిమ 164 వ భాగం

‘గోవల్లభుడ నేను, గోవులు మీరు’... వేదాంత పరంగా అహం (నేను) పదానికి పరబ్రహ్మ అని అర్థం. ‘అహం బ్రహ్మాస్మి’– ‘నేనే పరబ్రహ్మని’ అనే ఈ విజ్ఞానం లేని అజ్ఞానులైన మీరందరూ గోవులు– పశువులు. నేను గోవల్లభుడను– పశుపతిని అని పరమాత్ముని ఉద్ఘోష– చాటింపు! అహంకారం– ‘దేహమే నేను’ అన్న అభిమానం కల జీవుడే పశువు. ఆ అహంకారం నశిస్తే పశుపతి. అవిద్యా (అజ్ఞాన) పాశబద్ధుడు కదా జీవుడు. పాశముక్తుడు సదాశివుడు. ఊక (అజ్ఞాన ఆవరణ)తో ఆవరింపబడి ఉంటే వడ్ల గింజ. ఊక– పొట్టు తొలగిపోతే బియ్యపు గింజ. ఊక ఉన్నంతవరకు జీవునికి రాకపోకల– జన్మమరణాల కాక (తాపం) తప్పదు. పైపొట్టు పోతే ఇక పుట్టుట, గిట్టుట లేవు.

‘రాజు నే, భటులు మీరలు’.. ‘సర్వం ఖల్విదం బ్రహ్మ’– అంతా నిశ్చితంగా బ్రహ్మమే అయితే ‘రాజు– భటులు’ అన్న భేదం ఎందుకు చెప్పినట్టు? అంటే సత్తు అసత్తు, ఉచ్చం నీచం అంతా తానే కాన తన విలాసం (ఆత్మరతి)– వినోదం కొరకే ఈ భేద కల్పన! అభేదాన్ని– ఏకత్వాన్ని దర్శించడమే జ్ఞానం. అదే పరమార్థం. అయినా భజనం– ఉపాసన కొరకు భేద కల్పన. భక్తి కోసం కల్పితమైన ద్వైతం– జీవ ఈశ్వర భేదం అద్వైతం కన్నా ఎంతో సుందరమనీ, ఆ భక్తి వలన కలిగే ఆనందం మోక్షానందం కంటే వందల రెట్లు అధికమని మనీషుల– పరమ భాగవతుల అనుభవం! ‘నేఁదస్కరుండ, మీరింటి వారు’.. పరమాత్మ పశుపతియే కాక శ్రేయస్కరుడైన తస్కరపతి కూడా! ఏమిటీ ఆయన తస్కరించేది? అంటే, తనను నిరంతరం స్మరించే భక్తుల అనేక జన్మల పాప సమూహాన్ని– సంచిత పాపాన్ని హరిస్తాడు. అజ్ఞానమనే మొద్దు నిద్దురలో మునిగి ఉన్నట్లయితే, నీలో దాగి ఉన్న పెచ్చరిల్లిన కామ, క్రోధ, లోభాలనే దొంగల రూపంలో నేనే (జ్ఞాన అజ్ఞానాలు రెండూ తానే కనుక) నీ జ్ఞానమనే అమూల్య రత్నాన్ని అపహరిస్తానని కూడా హెచ్చరిక! ‘నేను సూత్రధారిని’.. ‘సూత్రేమణిగణా ఇవ’ (గీత)– ఈ నామ రూపాత్మక చరాచర వస్తువులన్నీ దారంలో పలు విధాల పూసల వలె వాస్తవానికి నాయందు గుచ్ఛబడి ఉన్నాయి. ‘సర్వాధారో నిరాధారః’– నేనే అంతటికీ ఆధారం. నాకు ఏ ఆధారంతోనూ అగత్యం లేదు. అన్ని మణులకూ దారమే ఆధారం. చిన్మయ దేవుడనే వాడు ఉంటేనే కదా మృణ్మయ ప్రాణుల నాటకాలు, పాత్రలు, అభినయాలు!

శుక ఉవాచ– రాజా! ఆ నల్లవాడు బాలకులెల్లవారిలో అల్లరి పిల్లవాడుగా అనిపిస్తున్నా మంచివాడే కాని కల్లరి– అసత్యవాది, వంచకుడు కాదు. దొంగగా కనిపిస్తున్నా ఆ గంగాతరంగ ధవళాంగుడు, శుభాంగుడు దయాంతరంగుడే! ఆ బాలగోపాలుని చౌర్యక్రీడలన్నీ భక్త ఔదార్య భరిత చిన్మయ లీలలే! మూల భాగవతంలో కేవలం నాలుగు శ్లోకాలలో ఉన్న బాలక్రీడా వర్ణనను స్వకపోల కల్పితంగా వేదాంతార్థ కలితంగా, పదునాలుగు కందాలలో లలితంగా విస్తరించి అందంగా పొందుపరచాడు అపరభక్తి కవితా విరించి పోతన!

రాజా! నిత్యమూ అందెల రవళులతో చిందులు తొక్కుచూ కనువిందు చేసే బాల ముకుందుడు ఒకనాడు మంద (గోకులం)లో ఏ కుందరదన (గోపిక)కీ కనిపించలేదు. ఆ ఆనందానికి నోచుకోని గోపికలందరూ ఏమీ తోచక ఓపికలు కోల్పోయి, నందగృహానికి వచ్చి ఆ చిన్నారి చిలిపి చేష్టలకు తట్టుకోలేక పోతున్నామని కోపం నటిస్తూ తల్లి యశోదతో ఇలా మొరపెట్టుకున్నారు..

**కం|| ‘బాలురకుఁబాలు లేవని**
**బాలెంతలు మొరలు వెట్టఁ బకపక నగి యీ**
**బాలుండాలము సేయుచు**
**నాలకుఁగ్రేపులను విడిచె నంభోజాక్షీ!’**

అమ్మా యశోదా! మా ఇళ్లలో పసివాళ్లకు పాలు చాలటం లేదని బాలెంతలు ఎంతగా గోల పెడుతున్నా వారి మొరలు ఆలకించక నీ తుంటరి పిల్లడు పకపక నవ్వుతూ, వెక్కిరిస్తూ లేగ దూడల తాళ్లు విప్పి తల్లుల వద్దకు వదిలేస్తున్నాడు.

**కం|| ‘పడతీ! నీ బిడ్డడు మా**
**కడవలలో నున్న మంచి కాఁగిన పాలా**
**పడుచులకుఁ బోసి చిక్కిన**
**కడవలఁబోనడిచె నాజ్ఞ కలదోలేదో!’**

పడతీ!– ఓ యమ్మా! కడవలలో ఉన్న చక్కగా కాగిన పాలను నీ బాలుడు తోడి పిల్లలచే తాగించాడు. సరే, అంతటితో ఊరుకున్నాడా? ఆ కడవలన్నీ పగులకొట్టాడు. చూడగా అతనిపై నీకు అదుపు ఆజ్ఞ ఉన్న జాడ ఏమాత్రం కనిపించడం లేదు. ఓ నందగోప కాంతా! ఈ వింత చూడు. నీ చిన్నవాడు నిన్నకాక మొన్న పుట్టాడో లేదో, అప్పుడే దొంగతనాలు మొదలుపెట్టాడు. అవి కూడా మామూలువి కాదు. మా ఇళ్లలో జొరబడి ఉట్లు అందకపోతే వాటి కింద రాళ్లు, పీటలు దొంతరలుగా పేర్చి, ఓ ఇందుముఖీ! అందుకునే ప్రయత్నం చేశాడు. ఇలా చేస్తాడనే మేము ఉట్లను ఇంకా ఎత్తుగా కట్టుకొన్నాము. చేతితో పట్టలేక మీవాడు ఎట్టకేలకు కిందనుంచే కుండకు పెద్ద చిల్లి పెట్టి మీగడపాలు దోసిళ్లలో పట్టి తాగాడు. ఓ తలోదరీ!– ఇంత సన్నని కడుపు కలదానా! అంతపెద్ద పొట్టగల పట్టి (కొడుకు)ని ఎట్లా కన్నావమ్మా? తల్లీ! నీ పుత్రుడు వీరింట్లో జొరబడి పెరుగంతా తిని పోతూపోతూ నిద్రపోతున్న ఇంటి కోడలి మూతికి కొద్దిగా పెరుగు అద్ది వెళ్లాడు. ఒసేయ్ నంగనాచీ! దొంగతిండి తింటావా అని కోడలిని అత్తగారు కొట్టింది. ముద్దరాలా! నీ ముద్దుల కొమరుడు ఒక ఇంట్లో చేరి ఘుమఘుమలాడుతున్న ఘృతాన్ని– నేతిని చక్కగా తాగి ఆ కడవలను పక్క ఇంటిలో పడవేసి పోయాడు. తరువాత వీరికి వారికి పెద్ద తగాదా అయింది. తెలుసా తల్లీ! మరో గోపిక...

**కం|| ‘వేలుపులటె నా కంటెను**
**వేలుపు మరి యెవ్వఁడనుచు వికవికనగి మా**
**వేలుపుల గోడపై నో**
**హేలావతి! నీ తనూజు డెంగిలిఁజేసెన్’**

మా ఇంటి పూజామందిరపు గోడలపై ఉన్న దేవుళ్ల చిత్రపటాలను చూసి నీ కొడుకు– ‘వీరా మీ దేవతలు? నా కంటే వేరే దేవత ఎవడైనా ఉన్నాడా? అని వెటకారంగా– వెక్కిరింతగా నవ్వుతూ వాటిపై ఉమ్మివేసి వెళ్లాడమ్మా!– భాగవత సిద్ధాంత రీత్యా ఇతర దేవతలందరూ శ్రీకృష్ణుని అంశావతారాలు. శ్రీకృష్ణుడు మాత్రం సాక్షాత్ భగవంతుడు– ‘కృష్ణస్తు భగవాన్ స్వయం’. ఆయన జగద్గురువు. జ్ఞానులు పరమాత్మని తమ ఆత్మలోనే దర్శిస్తారు తప్ప ప్రతిమలో కాదు– ‘శివోదేహే ప్రతిష్ఠితః’ అజ్ఞానులకు భావ నిశ్చలత– మనో నిగ్రహానికి విగ్రహాలు కల్పించబడ్డాయి. ‘యాన్తి దేవవ్రతా దేవాన్’ (గీత 9–25)– దేవతా పూజకులు– సత్త్వగుణం కలవారు దేవతలను, పితృదేవతల ఆరాధకులు– రాజసికులు పితృలోకాలను, భూత పూజకులు– తమోగుణ ప్రధానులు భూతలోకాలను పొందుతారు. అర్జునా! నా భక్తులు మాత్రం నన్నే చేరుతారు. అనగా త్రిగుణాతీతుడైన పరమాత్మను ఉపాసించువారు గుణాతీత బ్రహ్మపదవినే పొందుతారు.



అన్యదేవతారాధకులకు కూడా ఆయా దేవతల రూపంలో ఫలమిచ్చేది ఆ సర్వదేవతా స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మే!

వేరొక వనిత... ఆడుకొనే బంతి మా పెరట్లో పడిందని నీ సుపుత్రుడు మా దొడ్డి లోపలికి వచ్చి మా చిన్నది జలకమాడుతుంటే దాని వలువ– చీర తీసుకొని పారిపోయాడు. చెలువా! ఇదేమైనా బాగుందా? ‘అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః’ (గీత) ఆత్మ స్వరూపాన్ని అవగతం కానీయక– తెలియనీయక ఆవరించే అజ్ఞానమనే ఆవరణాన్ని– వస్త్రాన్ని అపహరించి అనుగ్రహం చూపాడని లీలా పరమార్థం! రాగల వస్త్రాపహరణ లీలకు ఇది నాందీ ప్రస్తావన– సూచన. ఇంకొకవ్రేత.. ఎర్రగా బొర్రగా ఉన్న మా కుర్రదాన్ని చూచి మీ కర్రివాడు– ‘నిన్ను దొంగతనంగా లేవదీసుకుపోతా, నాతో వస్తావా?’ అని అడిగాడట! ఓ వెర్రితల్లీ! ‘చిత్రమిట్టిది గలదే?’– ఇలాంటి చిత్రం ఎక్కడైనా చూశామా?– ఎవ్వరికీ తెలియకుండా నిన్ను ఆవరణ, విక్షేపాదులను దాటించి నా పరంధామానికి– మోక్షస్థానానికి గొనిపోతాను, రమ్మని పలికాడు. ఇదీ పరమార్థం! సాక్షాత్ మహాలక్ష్మీ స్వరూపురాలైన రుక్మిణీదేవి కూడా... ‘కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్’ (నువ్వు అంగీకరిస్తే నీవెంట రావడానికి సిద్ధంగా ఉన్నా) అని పరమాత్మకు ప్రణయ సందేశం పంపింది కదా!

**కం|| ‘కొడుకులు లేరని యొకసతి**
**గడు వగవఁగఁ దన్ను మగనిగా గైకొనినన్**
**గొడుకులు గలిగెదరని పైఁ**
**బడినాఁడిది వినుము శిశువు పనులే తల్లీ!’**

ఇదిగో తల్లీ! మరో విచిత్రం విను. ఒక మగువ నీ సుతుని చూచి, తనకు కొడుకులు లేరని వగవగా– బాధపడగా ‘నన్ను మగడుగా చేసుకొంటే నీకు బిడ్డలు పుడతారు’ అంటూ మీదిమీదికి వచ్చాడు నీ గడుసరి కొడుకు. ఇవి పసివాని పనులేనా?... సంతాన ప్రాప్తికి కూడా అంతిమంగా అనంతుని– పరమాత్ముని అనుగ్రహమే కారణం కదా! విష్ణు సహస్రనామ స్తోత్రంలో విష్ణుమూర్తికి వంశవర్ధనుడని, తంతు (సంతాన) వర్ధనుడని నామాలు. ‘గతిః భర్తా ప్రభుః సాక్షీ’ అని భగవద్గీత. సతులందరి పతులకు ‘పతి గతి’ కదా పరమాత్మ. ‘నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా’ అనేకదా తెలుగు వారి దైనందిన ప్రార్థనా పద్యం!



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

భగవంతుడి అవతారాలు పైకి ఒకలా కనిపిస్తాయి. లోతుగా విశ్లేషిస్తే.. అందులో అంతుచిక్కని రహస్యాలు ఉన్నాయనిపిస్తాయి. స్తంభ సంభవుడైన నరసింహుడి విచిత్రాకృతి విశేషమైనది. ఆయన సంహరించిన అసురుడి తత్వం విశృంఖలమైనది. స్వామి ఉద్ధరించిన ప్రహ్లాదుడి భక్తి విభిన్నమైనది. ఉగ్ర నరసింహుడిని శాంతపరచిన లక్ష్మీ కటాక్షం విస్తారమైనది. యాదగిరిగుట్టపై లక్ష్మీదేవిని మనువాడుతున్న నరసింహుడి ఆవిర్భావ ఘట్టం పౌరాణికంగా అందమైన కథ! సాంకేతికంగా పరికిస్తే.. అద్భుతమైన గాథ!



# ధరణికి ఛత్రం.. లక్ష్మీనృసింహం

శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్ర భోగమణి రాజిత పుణ్యమూర్తే!
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధి పోత
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్||

నేడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

**విష్ణు** సంబంధమైన అవతారాల్లో హిరణ్యకశిపుని నుంచి ప్రహ్లాదుని రక్షించిన స్వామి, గిరిజనుల నుంచి పురజనుల వరకు అందరికీ ఆరాధనీయమైన దైవం లక్ష్మీ నరసింహస్వామి. నవ నారసింహ స్వాముల రూపంలో ఆరాధనలు అందుకుంటున్న స్వామి ఆయన. ఉగ్ర నారసింహ, కృద్ధ నారసింహ, వీర నారసింహ, విలంబ నారసింహ, కోప నారసింహ, యోగ నారసింహ, అఘోర నారసింహ, సుదర్శన నారసింహ, శ్రీలక్ష్మీ నారసింహ స్వామి అనే అర్చావతారాల రూపంలో పూజలు పొందుతున్న స్వామి అవతారం వెనుక అంతరార్థాలు ఎన్నెన్నో....

**మన** భూమిని రక్షించడానికి భూమి చుట్టూ ఓజోన్ పొర ఒకటి ఉంటుంది. మిగిలిన ఏ గ్రహాలకు కూడా లేని సౌకర్యం ఇది. ఈ పొరను వైదిక వాఙ్మయం ‘హిరణ్య ప్రాకారం’ అనే పేరుతో పిలిచింది. ఈ పొరను కలిగి ఉన్న శక్తికి ‘హిరణ్మయి’ అనే పేరు పెట్టుకున్నారు. ఈ పొరకు ఏదైనా అవరోధం ఏర్పడితే వెంటనే ఇబ్బంది పడేది భూమి, దాని మీద ఉండే జీవ రాశులు. మొదట్లో ఈ పొర కొంత భూమికి సన్నిహితంగా ఉండి కొన్ని జీవులు మాత్రమే ఈ నేల మీద ఉద్భవించాయి. అప్పటికి పెద్ద జీవుల ఆవిర్భావం అయ్యే అవకాశం కలుగలేదు. ఈ పొరకు ఒకానొక సందర్భంలో ఇబ్బంది కలిగింది. మళ్లీ భూభ్రమణ, పరిభ్రమణాల వల్ల, సూర్య తేజస్సువల్ల ఆ సమస్య తొలగింది. ఈ విషయాన్ని సాధారణ జనానికి అర్థం అయ్యే విధంగా తెలియజేయడానికి కొన్ని పాత్రల ద్వారా పురాణం వివరించింది. ఈ విషయాలను తెలియజేసే పురాణ గాథలే వరాహ, నరసింహస్వామి ఆవిర్భావ గాథలు.

**పూర్వం** హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపులనే రాక్షసులు హిరణ్య ప్రాకారాన్ని (ఓజోన్ పొరను) తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. దానికి రంధ్రాలు చేసి సూర్యుడి అతినీలలోహిత కిరణ ప్రసారాలను భూమికి చేర్చేందుకు, సూర్యకిరణాలు భూమికి చేరకుండా ఉండేందుకు ప్రయత్నించారు. భూమి అనే ప్రహ్లాదుని అతలాకుతలం చేసే ప్రయత్నం చేసినవారు వీరిద్దరు. అయితే ప్రహ్లాదుడు మూలశక్తి అయిన సూర్యుడి శక్తిని (నరసింహస్వామి) ఉపాసించడం ద్వారా రక్షణ పొంది, తనను ఇబ్బంది పెట్టిన రాక్షసులను శక్తి సహకారంతో పారద్రోలి, ప్రశాంతంగా ఉండగలిగినాడు. ఇదే నరసింహస్వామి ఆవిర్భావ గాథ.

**ఇక్కడ** సూర్యుడు, సూర్యశక్తి, వెలుగు, వేడిమి అన్నీ నరసింహస్వామికి ప్రతీకలే. నరసింహునిలోని నరత్వం భూమి అయితే, సింహత్వం సూర్యునిది. సింహానికి ఉన్న జూలు లాంటిదే సూర్య కిరణాలు. నరసింహస్వామి అష్టోత్తర నామాలు చదివితే ఈ విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. సూర్యతత్త్వం, నరసింహ తత్త్వం సమానంగా ఉంటుంది. అందుకే అనేక రూపాల్లో నరసింహస్వామి... సూర్యుడికి ప్రతీకగా కనిపిస్తాడు. జ్వాలా నరసింహ, యోగ నరసింహ, గండభేరుండ నరసింహ, వైద్య నరసింహ, లక్ష్మీ నరసింహ వంటి పేర్లన్నీ సూర్య సంబంధమైన అధ్యయనంలో తెలుస్తుంటాయి. జ్వాలా నరసింహ భావన సూర్యుడి తీవ్రమైన అగ్ని జ్వాలలు. యోగ నరసింహ భావన కూడా తన చుట్టూ ఎందరో ఉన్నా, తాను తనలో లీనమై శక్తిమంతుడు కావడం, ఏకోన్ముఖుడు కావడం అనే విషయాన్ని తెలియజేస్తుంది. కోప, కృద్ధ, యోగ, వీర, అఘోర, సుదర్శన రూపాలన్నీ మనకు అర్థం అవుతూనే ఉన్నాయి. వీటన్నిటిలోనూ ప్రత్యేక విధానం లక్ష్మీనరసింహం. ఈ లక్ష్మీ రూపం ప్రత్యేకత ఏమిటో మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది.

**సూర్య** కిరణాలు భూమికి చేరాలంటే భూమి ఉద్ధరణ జరగాలి. అంటే జలం నుంచి బయట పడాలి. ఓజోన్ పొర సరైన విధంగా ఉంటే ఆ సూర్యకిరణాలు ఫిల్టర్ అవుతాయి. అప్పుడే సరైన వేడి భూమికి కలుగుతుంది. లేకుంటే భూమి విపరీతమైన వేడికి గురికావడమో, జలంలో మునిగిపోవడమో జరుగుతుంది. ఈ రెండింటిలో ఏది జరిగినా భూమి ఉద్ధరణ సాధ్యం కాదు. ఈ అంశంలో కీలక పాత్ర పోషించేది, ఓజోన్ పొర. అది లేకుంటే భూమికి మనుగడే లేదు. ఇక్కడ భూమి ప్రహ్లాదుడు. ఓజోన్ పొర లక్ష్మీదేవి. సూర్యుడు నరసింహస్వామి. హిరణ్యకశిపుడు భూమి, ఓజోన్ పొరలను పాడు చేసేవాడు. సూర్యశక్తిని లెక్కించని వాడు. ఈ రూపంలో ప్రతీకవాద సాహిత్యాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వ్యతిరేకతలన్నిటినీ ఉక్కుపాదంతో, వజ్రనఖాలతో తొలగించే తత్వం నరసింహ తత్వం. అయితే సూర్యరశ్మి పూర్తిగా భూమికి చేరి, భూమి మీద సకల సంపదలు నాశనం కాకుండా, రక్షించబడటానికి ఏర్పడిన ఓజోన్ పొర (హిరణ్య ప్రాకారం) లోపలి వాతావరణమంతా శ్రీలక్ష్మి మయం. సూర్యకిరణాలు ఓజోన్ పొర ద్వారా భూమికి చేరుతాయి. ఈ రకమైన కిరణ ప్రసారం వల్లనే భూమి చల్లబడుతుంది. అందుకే ఆ ఓజోన్ పొరకే లక్ష్మీదేవిగా నామకరణం జరిగింది. ఆ పొరే లేకుంటే భూమి అనే ప్రహ్లాదుడు కూడా ఇబ్బంది పడేవాడు.

**సాహిత్యంలో** శ్రీదేవి రూపం ఏదైనా, విష్ణువు పక్కన లక్ష్మీదేవి రూపంలో కనిపిస్తున్న అమ్మవారి రూపం కాని, శ్రీమాత, పార్వతి అనే అన్ని రూపాలు కూడా ఈ ఓజోన్‌కు సంబంధించినవే. ఈ రూపం హిరణ్మయీ రూపం. పాంచభౌతిక శక్తికి ప్రతిరూపం. ఈ రూప ఆరాధన మనకు విశేష ఫలితాన్నిస్తూ ఉంటుంది. సూర్యుడిని తండ్రిగా, ఓజోన్ పొరను తల్లిగా భావించే సంప్రదాయంతో అనేక కథలు, కథనాలు వెలువడ్డాయి. శ్రీ అనే శబ్దం కూడా అమ్మవారికి, ఓజోన్ పొరకు, ఆక్సిజన్‌కు సంకేతంగా వినియోగించడం సంప్రదాయం. అందుకే అన్ని ప్రత్యేక సందర్భాల్లో శ్రీ అనే శబ్దాన్ని వాడటం భారతీయ సంప్రదాయం. అందుకే శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆరాధన వల్ల మన చుట్టూ రక్షణ ఏర్పడటమే కాకుండా, ఏర్పడే వ్యతిరేకతలు తొలగిపోవడం జరుగుతుంది. ఈ భూమిలాగే మనకూ ఆనందప్రాప్తి కలుగుతుంది.

... సాగి కమలాకర శర్మ

# కరుణ కురిసే మాసం

ఇస్లాం బోధ

**ఒకానొకసారి** రంజాన్ నెలలో మక్కా ఇమామ్‌కు ఓ ఆఫ్రికా వ్యక్తి ఫోన్ చేసి ‘సహెరీ, ఇఫ్తార్ చేయకుండా ఉపవాసం ఉండకూడదా?’ అని అడిగాడు. అతని మాటలకు ఇమామ్ వెక్కివెక్కి ఏడ్చారు. సహెరీ, ఇఫ్తార్‌లో తినడానికి తిండికి నోచుకోనివారున్నారు. ఈ రంజాన్ ఉపవాసాలు పేదల ఆకలి బాధను అనుభవపూర్వకంగా తెలియజేస్తాయి. నిరుపేదలకు ఆకలి రుచి తెలుస్తుంది. మరి సంపన్నులకు ఆకలి గురించి తెలియదు. పేద, ధనిక, ఆడ, మగ అనే తేడాలేకుండా ముస్లింలు నెల రోజులపాటు రంజాన్ రోజాలు పాటించాలన్నది ధార్మిక విధి. ఈ ఉపవాసాలతో ఆకలి బాధ అందరికీ తెలిసి వస్తుంది. దీంతో పేదలపై దయ, జాలి జనిస్తాయి. ఏదైనా అనారోగ్య కారణంతో ఉపవాసాలు పాటించని వారు ఒక ఉపవాసికి సహెరీ, ఇఫ్తార్ చేయించాలన్నది షరియత్ నిబంధన. ఒక ఉపవాసికి ఇఫ్తార్ చేయించి ఆకలి తీరిస్తే ఉపవాసం పాటించినదానితో సరిసమానమైన పుణ్యం లభిస్తుంది. ఏదైనా కారణంతో ఉపవాస భంగం కలిగితే 60 మంది నిరుపేదలకు అన్నదానం చేసి... దాని పరిహారం చెల్లించాలి.



వృద్ధులు, రోగపీడితులు, బాలింతలు, పాలిచ్చే తల్లులకు ఉపవాసాల నుంచి మినహాయింపు ఉంది. వీళ్లంతా నెలసాంతం ఉపవాస దీక్ష చేపట్టేవారికి సహెరీ, ఇఫ్తార్ చేయించాల్సి ఉంటుంది. ఈ బోధనలన్నీ సాటి మనిషిపై కరుణను ప్రోత్సహించేవే. మనిషిలో మానవత్వాన్ని, మానవీయ విలువలకు పెద్దపీట వేసేవే. మనిషిలో కాఠిన్యాన్ని నిర్మూలించి కారుణ్యాన్ని పెంపొందించే నిబంధనలు ఇవి. రంజాన్ నెలలో ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునే వాతావరణం ఉంటుంది. అంతా కలసి పక్కపక్కనే కూర్చుని ఇఫ్తార్ చేసే అద్భుత అవకాశం ఉంటుంది. ఇఫ్తార్ వేళ.. ఎదుటి వారికి ప్రాధాన్యమివ్వడం గమనించవచ్చు. రంజాన్ నెలసాంతం ముహమ్మద్ ప్రవక్త (స) వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చేసేవారు. ‘దైవాన్ని విశ్వసించనంత వరకు మీరు స్వర్గంలోకి ప్రవేశించలేరు, అలాగే ఒకరినొకరు ప్రేమించుకోనంత కాలం మీరు నిజమైన విశ్వాసులు కాలేరు’ అన్న ప్రవక్త ఉద్బోధకు రంజాన్ ఉపవాసాలు చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

# సత్యమేవ జయతే

ఉపనిషద్ గాథ

**ఛాందోగ్య** ఉపనిషత్తులోని సత్యకాముడి కథ సత్యవాక్ పరిపాలన గొప్పదనాన్ని తెలియజేస్తుంది. సత్యకాముడు అనే బాలుడు ఉండేవాడు. అతను ఒకరోజు తన తల్లి దగ్గరికి వచ్చి.. ‘అమ్మా! మన గోత్రం ఏమిటి? సద్గురువు దగ్గర బ్రహ్మచర్య దీక్ష తీసుకోవాలని అనుకుంటున్నా. వారు గోత్రం ఏంటని అడిగితే ఏమని చెప్పాలి?’ అని అడిగాడు. తల్లి మథనపడుతూ ఇలా చెప్పింది. ‘నాయనా! నాకు తెలియదు. నా యౌవనంలో ఎక్కడెక్కడో తిరిగాను. ఎందరినో సేవించాను. నీవు పుట్టావు. నీ తండ్రి ఎవరో నాకు తెలియదు. నా పేరు జాబాలి. నీ పేరు సత్యకామ. గురువుగారు అడిగితే సత్యకామ జాబాలిని అని చెప్పు’ అన్నది. సత్యకాముడు.. గౌతమ మహర్షి ఆశ్రమానికి చేరాడు. మహర్షి గోత్రం అడిగితే తల్లి చెప్పినట్టే చెప్పాడు. ‘సత్యవాదే ఇలా పలుకగలడు. సమిధలు తీసుకురా! ఉపదేశం చేస్తా’ అన్నాడు గౌతముడు. సంప్రదాయ హోమం జరిగింది. బ్రహ్మచర్య దీక్ష తీసుకొని సత్యకాముడు గౌతముని శిష్యుడయ్యాడు. ఒకనాడు గౌతముడు 400 ఆవులను అప్పజెపుతూ ‘వీటిని జాగ్రత్తగా పెంచు. 1000 అయిన తర్వాత తిరిగిరా!’ అన్నాడు. సత్యకాముడు గురువు సంతృప్తి కోసం ఎంత కష్టమైనా పడాలని భావించాడు. వాటిని అరణ్యానికి తీసుకువెళ్లాడు. కొన్నేండ్లు గడిపాడు. సత్యాన్వేషణ తత్పరుడైన అతనికి ప్రకృతి పాఠాలు నేర్పింది.



ఆవులు, ఆబోతులు, చెట్లు, పిట్టలు, సెలయేర్లు, నక్షత్రాలు, సూర్యచంద్రులు సందేశాలు ఇచ్చాయి. పశువుల సంఖ్య వెయ్యి అయింది. క్రమంగా ఒక ఆబోతు, అగ్ని, ఒక హంస, ఒక నీటిపక్షి బ్రహ్మంలోని ఒక్కొక్క పాదాన్ని గురించి సత్యకాముడికి వివరించాయి. ‘ఈ నాలుగు పాదాలు కలిస్తే పరబ్రహ్మం అవుతుందని భ్రమించకు. నీవు విన్నదంతా బ్రహ్మంలో పావుభాగానికే రావచ్చు’ అని పలికింది నీటి పక్షి. సత్యకాముడు ఆవులతో ఆశ్రమానికి చేరుకున్నాడు. అతని ముఖస్థమై ఉన్న బ్రహ్మకళను గుర్తించిన గురువు అతనికి సర్వ విజ్ఞానాన్నీ ధారపోశాడు. సత్యవాక్ పరిపాలనమే బ్రహ్మజ్ఞానానికి అర్హత అని సత్యకాముడి గాథ తెలియజేస్తున్నది. బ్రహ్మజ్ఞానానికి అర్హుడైన మనిషికి.. మానుషులే గురువులు కావాల్సిన పనిలేదు. పశుపక్ష్యాదులు, పంచభూతాలు కూడా జ్ఞానాన్ని ప్రేమతో అందిస్తాయి.

... డా.వెలుదండ సత్యనారాయణ